ప్రజాశక్తి
శనివారం 6 మే 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఇళ్ల స్థలాలకు పచ్చజెండా

- హైకోర్టు తీర్పుతో వేగం పెంచిన అధికారులు
- ముమ్మరంగా లే అవుట్‌ల అభివృద్ధి పనులు
- రాజధాని రైతులకు నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఆర్‌డిఎ ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల స్థలాలిచ్చేందుకు హైకోర్టు శుక్రవారం పచ్చజెండా ఊపింది. తుది తీర్పునకు లోబడి స్థలాలు ఇవ్వాలని సూచించింది. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లస్థలాలను కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రాజధాని రైతులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీం కోర్టునూ ఆశ్రయించారు. అయితే రైతుల వ్యక్తం చేసిన అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. రాజధానిలో ఇతరులకు అవకాశం ఇవ్వకూడదని చెప్పడం సరికాదని, రాజధాని అందరిదని హైకోర్టు పేర్కొంది. భూ సమీకరణలో ఇచ్చిన భూములకు ప్రతిగా సిఆర్‌డిఎ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్‌లపైనే రైతులకు హక్కులుంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో రైతులు కొంత నిరాశకు గురయ్యారు. ఈ అంశంలో తుది తీర్పు ఇంకా రావాల్సి ఉందని, ఈ అంశంపై న్యాయకోవిదులతో చర్చిస్తామని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తెలిపారు.

కోర్టు నుంచి అడ్డంకులు తొలగిపోవడంతో అధికారులు తమ ప్రక్రియను వేగవంతం చేశారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశం ఇప్పటికీ కొలిక్కి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రాజధానిలోని ఏడు గ్రామాల్లో మొత్తం 21 లే అవుట్‌లు సిద్ధం చేస్తున్నారు. వీటిల్లో 47 వేల మందికి పట్టాలు ఇవ్వనున్నారు. మే 17 నాటికి లే అవుట్‌లను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 24 వేల మందికి 569.46 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించగా తొలి విడత 20,684 మందికి ఇవ్వడానికి

▶ 2లో



కేక్‌ను కట్‌చేసి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు తినిపిస్తున్న ఎంపి సురేష్

హైకోర్టు తీర్పుపై ఎంపి సురేష్ హర్షం

కేక్‌ను కట్ చేసి సంబరాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

పేదలకు రాజధానిలో ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై బాపట్ల ఎంపీ నందిగం సురేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉద్దండ్రాయునిపాలెంలోని తన కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ముఖ్యమంత్రి పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారికి కడుపు నింపుతున్నారని అన్నారు. ఎన్నో శతాబ్దాలుగా ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నారని, మరో 30 ఏళ్లు జగనే సిఎంగా ఉండాలని ఆకాంక్షించారు. బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎం.గురునాథం, పి.వరప్రసాద్, బి.రాజేంద్ర కుమార్, బి.శామ్యూల్, ఎన్.జోషి, బి.సాంబయ్య, ఇ.ఆదాం, పి.దాసు, ఐ.సుభాషిణి, రాజ్‌కుమార్, కె.పుష్పరాజ్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరి పంటను ఎ. సూర్య కుమారి, కలెక్టర్‌కు చూపుతున్న రైతు

నిరుత్సాహం వద్దు.. ఆదుకుంటాం..

- రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోండి
- పంట నష్టంపై జిల్లా ప్రత్యేకాధికారి పరిశీలన

ప్రజాశక్తి - నరసరావుపేట

అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, నిరుత్సాహ పడొద్దని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి అయిన ఎ.సూర్యకుమారి అన్నారు. దెబ్బతిన్న పంటల పరిశీలన కోసం పల్నాడు జిల్లాకు వచ్చిన కమిషనర్ అనంతరం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజులుగా జిల్లాలో 52.01 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైందని, అకాల వర్షాల నేపథ్యంలో వరి, పత్తి, ఇతర ఉద్యానతోటలు దెబ్బతిన్నాయని చెప్పారు. 1047.5 ఎకరాల్లో వరి, ఉద్యాన పంటలు, 17.5 ఎకరాల్లో పత్తి, మునగ, పుచ్చ, అరటి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టంపై యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందిస్తామని, నష్టపోయిన రైతులెవరైనా ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పిడుగుపడి క్రోసూరు మండలంలో ఒకరు చనిపోయారని, పశువులు, గొర్రెలకు నష్టమేమీ వాటిల్లలేదని అన్నారు. పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందేలా చూస్తామని, వివరాల పరంగా ఇబ్బందులుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ : 8897798430 ద్వారా చెప్పొచ్చని అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్

▶ 2లో

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళులు

వార్తలు లోపలి పేజీల్లో



విలపిస్తున్న మృతుని కుటుంబీకులు.. ఇన్‌సెట్‌లో మృతుడు నసీ (ఫైల్)

పని చేస్తూ ప్రాణం పోగొట్టుకున్న కార్మికుడు

ప్రజాశక్తి - నరసరావుపేట

అపార్టుమెంట్‌లో విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదానికి గురై మైనర్ అయిన కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పట్టనంలోని రెడ్డి నగర్‌లో శుక్రవారం జరిగింది. మృతుని కుటుంబీకుల వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం గురిజవోలుకు చెందిన షేక్ నసీం (17) తండ్రి పదేళ్ల కిందటే గుండెపోటుతో మరణించాడు. దీంతో నసీం పదో తరగతితో చదువుకు స్వస్థి చెప్పి కుటుంబ పోషణలో భాగంగా రెండేళ్ల నుండి పట్టణానికి చెందిన ఒ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ పనులకు వెళ్తున్నాడు. ప్రతిరోజూ పనికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం పనికి వెళ్లిన నసీం రెడ్డినగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో గోడను డ్రిల్లింగ్ మిషన్‌తో పగలగొడుతున్నాడు. ఈ సందర్భంలో మిషన్ వైరు తెగి కాలికి తగలడంతో పెద్దగా అరుస్తూ కుప్పకూలాడు. తోటి కార్మికులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి

▶ 2లో

రంగస్థల వైభవానికి కళాపరిషత్‌లే ఆయువుపట్టు

కొలంకపురి నాటక కళాపరిషత్ ఆహ్వాన నాటిక పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి

రంగస్థల కళావైభవానికి కళాపరిషత్‌లు ఆయువుపట్టుగా ఉన్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని కొలకలూరు శివాలయం కూడలిలో కొలంకపురి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలను ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ప్రముఖ రంగస్థల నటులు డి.రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా వి.సత్యసాయి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెనాలి ప్రాంతం ఎంతో మంది కళాకారులకు పుట్టిల్లన్నారు. కొలకలూరులో కళారంగానికి మంచి ఆదరణ ఉందన్నారు. తొమ్మిదేళ్లుగా కొలంకపురి నాటక కళాపరిషత్ నాటికల పోటీలు నిర్వహించటమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా కరణం సురేష్ జ్ఞాపకార్థం

▶ 2లో



మనసున మనసై నాటికలో సన్నివేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

సిఎస్ఆర్ నిధులతో హాస్టల్స్ అభివృద్ధి

వాణిజ్య సంస్థలు, బ్యాంకర్లతో జెసి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ వసతి గృహాలను ఆధునీకరించి, విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించాలనే జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సంకల్పంలో భాగంగా ప్రముఖ కంపెనీలు, బ్యాంకర్లతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ (సిఎస్ఆర్) సమావేశం జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలోని 75 వసతి గృహాల్లో సౌకర్యాల కల్పన, మరమ్మతులకు సమకూర్చాల్సిన సూమారు రూ.6.23 కోట్లు నిధుల సేకరణ, త్వరితగతిన పనులు పూర్తి చేయడంపై ఐటీసీ, కోకో-కోలా, పెరల్ బేవరేజస్, కెనారా, ఐఒబీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డీఎం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలకు చెందిన ప్రతినిధులతో జెసి చర్చించారు. సానుకూలంగా స్పందించిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములం అవుతామని చెప్పారు. పూర్తి వివరాలతో మరోక వారంలో నిర్వహించే సమావేశానికి హాజరవుతామన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మధుసూదనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు పాల్గొన్నారు.



ఆకాల వర్షాలతో విలవిల

ప్రజాశక్తి - మాచర్ల

అకాల వర్షాలతో మాచర్ల ప్రాంతంలో రైతున్నలు ఆందోళనకు గురవుతున్నారు. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి పంటలు తడిచి దెబ్బతింటున్నాయని దిగులుపడుతున్నారు. శుక్రవారమూ పలు ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం రావడంతో పంటను కాపాడుకోవడానికి ఉరుకులుపరుగుల మీద వెళ్లి పంటలపై పట్టాలు కప్పారు. గాలికి పట్టాలు చినగిపోతున్నాయని, సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమోషన్లు, బదిలీలను వేసవిలోనే పూర్తి చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రెంటచింతల

ఉపాధ్యాయులు ప్రమోషన్లను, బదిలీలను వేసవి సెలవుల్లోనే చేపట్టాలని యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంబి చిన్నమ్మ, జాన్ విజయ రాజ్ కుమార్ కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం శుక్రవారం వారు మాట్లాడుతూ పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేనాటికి ఈ ప్రక్రియలను ప్రభుత్వం ముగించాలన్నారు. అడ్ హాక్ (తాత్కాలిక) ప్రమోషన్లను క్రమబద్ధీకరించాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు నుంచి తప్పించాలని కోరారు మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనాన్ని ఎత్తివేయాలన్నారు.

రెంటచింతల ఉప సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ అయిన రెంటచింతల ఉపసర్పంచ్ పదవికి ఏరువ ప్రమీల భాస్కర్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని డిపిఒ భాస్కర్‌రెడ్డికి శుక్రవారం అందజేయగా దాన్ని ఆమోదించినట్లు డిపిఒ తెలిపారు. ప్రమీల భాస్కర్‌రెడ్డి రెంటచింతలలోని 14వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా నూతన వైస్ సర్పంచ్‌గా 6వ వార్డు సభ్యులు పేర్ల చౌడమ్మను ఎన్నుకోనున్నట్లు తెలిసింది.



ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభిస్తున్న మేరిగ విజయలక్ష్మి

మ్యూజిక్‌తో మానసిక ఉత్తేజం

సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంగీతం, మ్యూజిక్ మనసును ఉత్తేజపర్చడంతో పాటు ఆహ్లాదపర చడంతో పాటు శరీరంలో రుగ్మతలను రూపుమాపుతాయని రాష్ట్ర సంగీత, నత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి అన్నారు. పెదకాకాని సమీపంలో రెయిన్ ట్రీ పార్కు అపార్ట్మెంట్ ప్రాంగణంలో శుక్రవారం షాన్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ ఇన్స్టిట్యూట్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ పిల్లా,పెద్దా తారతమ్యంలేకుండా ప్రతి ఒక్కరూ మ్యూజిక్‌ను విని ఉత్తేజం పొందుతారని అన్నారు. భవిష్యత్తులో షాన్ అకాడమీ ని ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆమె కోరారు.అన్ని జిల్లాల్లో ఉన్న సంగీత, నత్య కళాశాలల నుంచి నివేదికలు తెప్పించుకొని అందుకు అనుగుణంగా సంగీత, నృత్య అకాడమీలను అభివృద్ధి పరుస్తామన్నారు. రానున్న రోజుల్లో ఈ రంగానికి ప్రభుత్వం మంచి సహకారం అందించేలా తన వంతు కషి చేస్తానని మేరిగ స్పష్టం చేశారు. రాష్ట్రంలో విభజిత జిల్లాల్లో సైతం సంగీత, నత్య కళాశాలలు, అకాడమీల ఏర్పాటుకు త నవంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. ఐజెఎం ప్రాజెక్ట్ టీం మేనేజర్ బిపిన్ కుమార్ మిశ్రా, శామ్యూల్ మనీ పాల్గొన్నారు.

రంగస్థల వైభవానికి కళాపరిషత్‌లే ఆయువుపట్టు

(మొదటిపేజీ తరువాయి)

సవ్యసాచి పురస్కారంతో కళాపరిషత్ తరఫున ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు శ్రీపాద కుమారస్వామిని సత్కరించారు. నాటకోత్సవాల తొలిరోజున నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ ప్రాంగణంలో హైదరాబాద్‌కు చెందిన కళారంజని వారు 'మనిషి మంచోడే' నాటికను ప్రదర్శించారు. కాటా సుబ్బారావు రచనకు జెట్టి హరిబాబు దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'మనసున మనసై' నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన మల్లేశ్వరరావు, కృష్ణ హితేష్ కాగా మహ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో కళాపరిషత్ బృందం గోపరాజు వెంకట రమణమూర్తి, సుద్దపల్లి మురళీధర్, గోపరాజు విజయ్, డివిఎస్ మూర్తి, షేక్ జానిబాషా పాల్గొన్నారు.

పని చేస్తూ ప్రాణం పోగొట్టుకున్న కార్మికుడు

(మొదటిపేజీ తరువాయి)

తరలించగా నసీం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న పెద్ద కుమారుడు చనిపోవడంతో ఇక తమకు దిక్కెవరంటూ నసీం తల్లి నాగూర్ బీ విలపించిన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నసీం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు కాంట్రాక్టర్, భవన యజమాని సంయుక్తంగా రూ.10 లక్షలు తక్షణ ఆర్థిక సాయంగా ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. కార్మికులు పని చేసే ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు భద్రతా నమూనాలపై చేయాల్సిన ఏర్పాట్లపై కార్మిక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాలకు పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

పట్టాలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం కురగల్లు, నిడమర్రు, మందడం తదితర గ్రామాల్లో 11 లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన 23 వేల మందికి 550 ఎకరాల్లో స్థలాలివ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా 20 వేల మందికి పట్టాలు ఇవ్వనున్నారు.

లేఅవుట్ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించారు. రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్, సర్వే, గృహ నిర్మాణ శాఖ అధికారులు లేఅవుట్‌ల రూపకల్పన, ఇళ్ల స్థలాల కేటాయింపు, మ్యాపింగ్ చేయడంలో నిమగ్నమయ్యారు. పెదకాకాని, తుళ్లురు మండలాలతో పాటు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 20 వేల మందికి ఇంటి స్థలాల పట్టాలను ఈనెల 17 తరువాత ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, ఐనవోలు గ్రామాల్లో 10 లేఅవుట్‌లలో పెదకాకాని, తుళ్లురు, మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారులకు అవకాశం కల్పించనున్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు తరువాత జగనన్న కాలనీల్లో ఇళ్ల కేటాయింపునకూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆరు మండలాలు, గుంటూరు జిల్లాలోని నాలుగు మండలాలకు చెందిన 47వేల మంది లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 40 వేలమందిని అధికారులు ఖరారు చేశారు.

నిరుత్సాహం వద్దు.. ఆదుకుంటాం..

(మొదటిపేజీ తరువాయి)

ఎల్.శివశంకర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సమాచారం మేరకు ఇంకా మూడ్రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులంతా మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులకు సహకరించాలని అధికారులనూ ఆదేశించామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-అచ్చంపేట

అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం శుక్రవారం పరిశీలించారు. తాళ్లచెరువు, నీలేవరపాలెం గ్రామాల్లోని తమ మొక్కజొన్న పంట దెబ్బతిందని రైతులు రాజారెడ్డి, వెంకటేశ్వర్లుకు రైతు భరోసా కేంద్రాల్లో ఫిర్యాదు నేపథ్యంలో పరిశీలించారు. తాను ఐదెకరాల్లో మొక్కజొన్న సాగుచేశానని, రెండు ఎకరాలు కండెలు కోయగా మరో మూడెకరాలు కోసే సమయంలో వర్షం పడి పూర్తిగా నష్టపోయానని తాళ్లచెరువుకు చెందిన రైతు రాజారెడ్డి వాపోయారు. పంటలను కప్పడానికి ఉపయోగించే టార్పాలిన్ పట్టాలను మూడేళ్లుగా సబ్సిడీపై ఇవ్వడం లేదనీ అన్నారు.

పాలకమండలిలో కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యునివర్సిటీలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వీసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ తెలిపారు. వర్సిటీలో నూతనంగా ప్రారంభించే కోర్సులకు ఆమోదం లభించిందన్నారు. బిల్డింగ్ కమిటీ సూచించిన ప్రతిపాదనల్లో బాలురకు, బాలికలలు ఒకొక్కటి చొప్పున నూతన వసతిగృహాలను నిర్మించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. అకడమిక్ సెనేట్‌లో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం లభించింది. అలాగే కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సిఎఎస్) ఇంటర్వ్యూల్లో డాక్టర్ రత్నాకర్ (జియాలజీ), డాక్టర్ ఆర్.రమేష్ రాజు (కెమిస్ట్రీ), డాక్టర్ మాధవి (తెలుగు)లు ప్రొఫెసర్లుగా డాక్టర్ పద్మజ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. వర్సిటీలోని లైబ్రరీలో విధులు నిర్వహిస్తున్న చిత్తూరు శ్రీను అభ్యర్థన మేరకు వాలంటరీ రిటైర్మెంట్ కు ఆమోదం లభించినట్లు వీసి తెలిపారు.



క్రీడాకారుల్ని అభినందిస్తున్న మేయర్

క్రీడాకారులకు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు :చండీఘర్, ఢిల్లీలో ఏప్రిల్ 28, 29,31వ తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, జూనియర్, సీనియర్ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్స్‌తో సహా పలు మెడల్ సాధించిన బుడంపాడుకు చెందినా హరిహర రమేష్ శర్మను, నగరంపాలెంకు చెందిన శాఖమూరి కార్తీక్‌ను నగర మేయర్ శుక్రవారం సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందిం చారు. మేయర్ మాట్లాడుతూ రమేష్ శర్మ, కార్తీక్‌లు భవిష్యత్‌లో మరింత రాణించి, నగరానికి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు.

విద్యార్థులను శిల్పాలుగా మార్చాలి

ప్రజాశక్తి-గుంటూరు

గౌతమ బుద్ధుడు, కార్ల్ మార్క్స్ వంటి మహనీయుల తత్వజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, భవిష్యత్ తరాలను తీర్చేదిద్దాల్సిన బాధ్యత గురువులపైనే ఉందని, ప్రముఖ తత్వకవి, అభ్యుదయవాది జయరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చంద్రమౌళి నగర్, భాష్యం విద్యాసంస్థల సమావేశ మందిరంలో మానవత, స్టెప్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "టీచర్ ఎంపవర్మెంట్" ప్రోగ్రాంలో భాగంగా నాలుగవ రోజు గౌతమబుద్ధ, కార్ల్ మార్క్స్ జయంతులను పురస్కరించుకొని ముఖ్య వక్తగా పాల్గొన్న జయరాజ్ పాల్గొని మాట్లాడారు. కాలమానాలకు అతీతంగా గౌతమ బుద్ధుని సిద్ధాంతాలు కనిపిస్తాయన్నారు. సమాజంలో దోపిడీని, ప్రశ్నించి, శోధించి ఆచరణాత్మక పరిష్కారం చూపించడంలో కార్లమార్క్స్ విజయం సాధించాడని చెప్పారు. మనిషి శక్తివంతుడు అవ్వాలంటే కారకాలను అన్వేషిస్తూ భావ స్ఫూర్తిని నిలపడమే శిలా నీవే, శిల్పి నీవే, కవిత సందేశం ఇస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉంటూ తమ జ్ఞాన సమపార్జన ద్వారా



మాట్లాడుతున్న జయరాజ్

విద్యార్థులను నైతిక విలువలతో మానవీయ పౌరులుగా మలచాలని ఉద్బోధించారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ నూతలపాటి అరవింద అధ్యక్షత వహించగా, కార్యక్రమములో స్టెప్ వ్యవస్థాపకులు ప్రత్యూష సుబ్బారావు, మానవతా చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్షులు ఎస్. రామారావు, అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపారులను భయపెడుతున్న పులుల సంచారం

ప్రజాశక్తి - మాచర్ల :పులుల సంచారం గురించి తెలుసుకున్న మాచర్ల నియోజకవర్గంలో అటవీ ప్రాంతం సమీపంలో పశువుల కాపారులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా దుర్గి, వెల్దుర్తి, మాచర్ల, కారంపూడి మండలాలకు శివారుగా అటవీ ప్రాంతం అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో వ్యవసాయంతో పాటు రైతులకు పశుపోషణ కుటుంబ జీవనానికి ప్రధాన ఆధారం. వెల్దుర్తి మండలంలో ఆవులు, గొర్రెలు 20 వేలకు పైగా ఉన్నాయి. ఇవి కాక తెలంగాణ ప్రాంతం నల్గోండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుండి ప్రతి ఏటా డిసెంబర్ నుండి వేల సంఖ్యలో ఆవులు, గొర్రెలను పల్నాడు ప్రాంతంలో మేపడానికి కాపరులు వస్తుంటారు. తిరిగి జూన్‌లో వర్షాలు పడే వరకు ఈ ప్రాంతంలో ఉండి, వర్షాలు పడిన తరువాత వారి ప్రాంతాలకు తిరుగు ముఖం పడతారు. తెలంగాణకు చెందిన కొంత మంది గొర్రెల కాపారులు పూర్తిగా ఈ ప్రాంతంలోనే తమ జీవాలను మేపుకుంటూ, మనుషులు మాత్రం వస్తూ, పోతు ఉంటారు. పశువుల పెంపకానికి అనువైన ప్రదేశంగా ఈ ప్రాంతం ఉండటమే ఇందుకు కారణం. పత్తి, మిర్చి, మొక్కజొన్న తోటలలో పంట అయిన తరువాత వాటిని మేపటంతో పాటు, మిగిలిన సమయంలో అటవీ ప్రాంతంలో పశువుల కాపారులు తమ పశువులను మేపుతుంటారు. ఈ నేపథ్యంలో పులుల సంచారం



దృష్ట్యా అటవీ ప్రాంతంలోకి వెళ్ళవద్దని అటవీ శాఖ అధికారులు చెప్పడంతో కాపరులంతా ఏమి చేయాలో పాలుపోవటం లేదని అంటున్నారు. గ్రామాలలో గతంలో బీడు భూములు ఉండేవని, పశువుల మేతకు అవి ఉపయోగపడేవని, ఇప్పుడు వాటిని ఇతర అవసరాలకు వాడుతుండడంతో తమకు అటవీ ప్రాంతంలోకి వెళ్లక తప్పని పరిస్థితి అని చెబుతున్నారు. దీనిపై అధికారులు ఆలోచించి పశుపోషణకు అనువైన కొన్ని ప్రాంతాలనైనా చూపాలని కోరుతున్నారు.

వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించండి

వికలాంగులకు వాహనాలు అందజేసిన మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్



వాహనాలు అందచేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అంబటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ఎనిమిది మందికి రూ.702లక్షల విలువైన మోటారు త్రిచక్ర వాహనాలను మంత్రి అందజేసి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 92 వేల విలువైన ఒక్కో వాహనాన్ని వికలాంగుల సంక్షేమం కోసం ఉచితంగా అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోమున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజా నారాయణ, ఎంపిపి షేక్ జైబూన్ బి, జడ్పిటిసి సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో సత్యనారాయణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : సిపిఎం

ప్రజాశక్తి-మంగళగిరి



సభలో మాట్లడుతున్న ఎస్ఎస్ చంగయ్య



తుపాకుల సుబ్బారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెవి రాఘవులు

సిపిఎం పట్టణ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తుపాకుల సుబ్బారావు ఐదో వర్ధంతి సభ శుక్రవారం రాత్రి పట్నంలోని నాలుగో వార్డులో తుపాకుల సుబ్బారావు విగ్రహం వద్ద సిపిఎం నాయకులు ఈగ సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ తుపాకుల సుబ్బారావు జీవించినంత కాలం కమ్యూనిస్టుగా ఉండి, పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలను చేశారని అన్నారు. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడిన మహా వ్యక్తి తుపాకుల సుబ్బారావు అని అన్నారు. సుబ్బారావు ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఘనమైన నివాళిని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ సుబ్బారావు సిపిఎం నాయకులుగా, మూడుసార్లు కౌన్సిలర్‌గా విజయం సాధించి అనేక ప్రజా సమస్యలను ఈ ప్రాంతంలో పరిష్కరించడం జరిగిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే సుబ్బారావు ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే అవుతుందని అన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ కమ్యూనిస్టుగా నిజాయితీగా నిలబడిన మహా వ్యక్తి సుబ్బారావు అని అన్నారు. అనేక పర్యాయములు ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులను పోలీసులు అనేక ఇబ్బందులు పెట్టినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ పేద ప్రజలను అనేక ఇబ్బందులు గురిచేస్తుందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులను కూడా కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను పోలీసుల అండతో నిర్బంధంతో అణచివేయాలని వైసీపీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలకవర్గాల విధానాలపై పేద ప్రజల సంఘటన ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వివి జవహర్‌లాల్, పట్టణ నాయకులు ఎస్ గణేష్, టి శ్రీరాములు, మహిళా సంఘం నాయకురాలు జే బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు. తొలుత తుపాకుల సుబ్బారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

14 నుండి సమ్మర్‌క్యాంప్

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోలా ముత్యాలరావు, డి.దశరథరామిరెడ్డి, వై.బర్నబస్ ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లలకు డ్రాయింగ్, క్రాఫ్ట్, సైన్స్ సంగతులతో పాటు ఆటలు పాటలు కథలు చెప్పుకుందాంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేతాజీ సెంటర్‌లోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు జయప్రదం చేయాలని కోరారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు రెండు గంటలు మాత్రమే ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. పిల్లలకు విజ్ఞానం, వికాసం వికసింప జేయడానికి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 13వ తేదీలోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు 9182232632, 99853 76409, 9030908044 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు మేడే ఆటాపాట

ప్రజాశక్తి-తాడేపల్లి : మేడే వారోత్సవాల సందర్భంగా 6వ తేదీ శనివారం సాయంత్రం ఆరు గంటలకు పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొని మాట్లాడతారని చెప్పారు. సభకు ముందు, అనంతరం పిఎన్ఎం కళాకారుల ఆటపాటతో పాట పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఇంపాక్ట్ మెగా ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : వ్యక్తిత్వ వికాసం, సామాన్యుల జీవితాలను మార్చే దిశగా నగరంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంపా నాగేశ్వరరావు నేతృత్వంలో ఈనెల 10, 11 తేదీల్లో గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహిం చనున్న మెగా ఈవెంట్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ ఎం.మోహన్ మాట్లాడుతూ ఈవెంట్‌లో సుమారు 1500 మంది విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపార వేత్తలు పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ వ్యాపార, విద్యావేత్తలు, సివిల్ సర్వీసు అధికారులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో ఇంపాక్ట్ గుంటూరు ఇన్‌ఛార్జి చల్లా రవి, డాక్టర్ యద్దనపూడి అరుద్ర పాల్గొన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9494466389 నంబర్‌లోగానీ, http//gampa.in/events వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్



జిజిహెచ్‌కు 2డి ఎకో మిషన్ వితరణ

దాతను అభినందించిన వైద్యశాఖ డైరెక్టర్ నరసింహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు ముందుకు వచ్చి సాయం చేయడం అభినందనీయమని వైద్య విద్య సంచాలకులు డాక్టర్ డివిఎస్ యల్ నరసింహం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం లాలుపురంకు చెందిన మంచాల రామయ్య ఆమె సతీమణి అలివేలమ్మ జ్ఞాపకార్థం అందచేసిన రూ.15 లక్షల విలువ గల 2డి ఎకో పరికరాన్ని ఆయన ప్రారంభించారు. గుండె జబ్బుల సంబంధించి వ్యాదుల నిర్ధారణ కోసం ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ నరసింహం అన్నారు. పీజీ విద్యార్థులకు విలువైన సమాచారన్ని అందించేందుకు ఈ పరికరం ఉపయోగంగా ఉంటుందన్నారు. గుండె పొరల్లో నీరు చేరిందా.. గుండే కావటాల్లో వ్యాధుల నిర్ధారణ కోసం కూడా తెలుసుకోవచ్చుని, అదేవిధంగా గుండె పని చేసే విధానాన్ని బలహీనతలను కూడా తెలియ చేస్తోందని ఆయన అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాజ్యోతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సిద్దార్ధ మెడికల్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె సుధాకర్, జనరల్ మెడిసిన్ హెచ్ ఓ డి డాక్టర్ దాన శ్రీనివాసరావు, డాక్టర్ శైలజ, డాక్టర్ సుధీర్ బాబు, డాక్టర్ అనిల్ కుమార్, దాతలు మంచాల అప్పారావు మంచాల గోపికృష్ణ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

ప్రజాశక్తి -మేడికొండూరు





వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

మండల కేంద్రమైన మేడికొండూరులో గురువారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. రూ.లక్ష విలువచేసే నగదు, బంగారు నగలు అపహరించారు. గ్రామానికి చెందిన మేడికొండూరు సూర్యచంద్రం రోజు మాదిరిగానే తన షాపును మూసివేసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ప్రధాన తలుపు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బీరువాల్లాకర తాళం పగలగొట్టి లోపల ఉన్నారు రూ. 50 వేలు రూపాయల నగదు, రూ. 50 వేలు చేసే ఉంగరాలు, సుమారు లక్ష విలువ చేసే నగదు బంగారు వస్తువులు అపహరించుకు పోయారు. దీంతో రాత్రి సమయంలో ఇంటి యజమాని సూర్యచంద్రం ఇంట్లో ఒకసారిగా వచ్చిన శబ్దానికి లేచి చూసేసరికి బీరువా పగలగొట్టి వస్తువులన్నీ చిందర, వందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులు సమాచారం తెలిపారు. మేడికొండూరు ఎస్సై వినోద్ పవన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంటూరు నుండి క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలని సేకరించారు. పోలీసులు కేసు దర్యాపు చేస్తున్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఆంజనేయ కాలనీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటరమణ 47 సంవత్సరాలు ఇంట్లో శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకట రమణ ఏపీఎస్పీ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తూ, జిమ్ సెంటర్‌లో కూడా ఫిజియోథెరపీగా పని చేస్తాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.



మోడల్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంసెట్, నీట్ మోడల్ పరీక్ష


ప్రజాశక్తి-పిడుగురాళ్ల

చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలో ఎంసెట్, నీట్ మోడల్ పరీక్షలను శ్రీచైతన్య జూనియర్ కళాశాల, స్కాలర్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, విద్యార్థులకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాయి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో మోడల్ పేపర్‌ను రూపొందించి మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షకు 200 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష పత్రాన్ని డాక్టర్ చింతలపూడి రమ్య ఆవిష్కరించగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ సిద్ధి, వంశీ, జిల్లా ఉపాధ్యక్షులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

అర్హతున్న ప్రతిఒక్కరికీ మిషన్ వాత్సల్య

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ, మండల పరిధిలో అర్హతున్న ప్రతి ఒక్కరికీ మిషన్ వాత్సల్య పథకాన్ని అందిస్తామని కమిషనర్ ఇవి రమణబాబు, తహశీల్దార్ రమేష్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఒక కుటుంబంలో తండ్రి లేదా తండ్రి, లేదా ఇద్దరూ మరణించిన పిల్లలకు ఇది వర్తిస్తుందని అన్నారు. భర్తతో విడిపోయి విడాకులు లేకుండా పెద్దల సమక్షంలో విడిపోయిన వారికి, కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో దూరంగా ఉండే వారి పిల్లలకూ వర్తింస్తుందని చెప్పారు. దీనిపై స్థానిక విఆర్ఒ పరిశీలించి సిఫార్సు చేస్తే అర్హత లభిస్తుందని, అర్హత పొందిన వారికి నెలకు రూ.4 వేల చొప్పున అందుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా దీనిపై విఆర్ఒలకు తగిన సమాచారం లేక ఆర్జీలను వెనుక్కు పంపిస్తున్న నేపథ్యంలో కమిషనర్, తహశీల్దార్ కలిసి విఆర్ఒలు, మహిళా పోలీసులు కలిసి ప్రతి గడపకు వెళ్లి అర్హత గల్గిన లబ్ధిదారులను గుర్తించి సిఫార్సు చేయాలని ఆదేశించారు.



తహశీల్దార్‌కు నోటీసు ఇస్తున్న విఆర్ఎలు

నిరాహార దీక్షకు వెళ్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో శనివారం నిర్వహించే నిరాహార దీక్షల్లో తాము పాల్గొంటున్నట్లు విఆర్ఎల సంఘం పట్టణ అధ్యక్షులు టి.ఆనందకుమార్ తెలిపారు. ఈ మేరకు నోటీసును తహశీల్దార్‌కు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో కె.సుబ్బారావు, డి.ఆశీర్వాదం, జె.ఆనంద్‌రావు, షేక్ బాజీ, సిహెచ్ పోతురాజు, కె.అశ్విని, షేక్ రఫీ, నాగేశ్వరావు పాల్గొన్నారు.



కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గద్దె చలమయ్య, విజయ్‌కుమార్ తదితరులు

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రపంచ గతిని మార్చి సోషలిజానికి కార్ల్‌మార్క్స్ బాటలు వేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, అన్నారు. కార్ల్‌మార్క్స్ 205వ జయంతి సందర్భంగా స్థానిక పుతుంబాక భవన్‌లో ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల్ని పెట్టుబడిదారులు దోచుకునే విధానాన్ని వ్యతిరేకిస్తూ, కార్మికులను చైతన్యవంతుల్ని చేశారని చెప్పారు. తన భావాలు, పోరాటాల వల్ల సొంత దేశాన్ని వదిలి ఏ దేశానికీ చెందని వానిగా జీవించాడని తెలిపారు. ప్రపంచ చరిత్ర మొత్తం వర్గ పోరాటాల చరిత్రని చెప్పారని అన్నారు. మార్క్స్ చూపిన బాటలోల సమసమాజ స్థాపన కోసం అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు జి.ఉమశ్రీ, జి.వేమయ్య, ఎ.ప్రసాదరావు, సైదులు, హరిపోతురాజు, కె.దుర్గారావు, పి.మహేష్, జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మార్క్స్ చిత్ర పటానికి పూల మాలలలేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు కె.రామారావు మాట్లాడుతూ ప్రస్తుత జర్మనీలోని ట్రయర్ పట్టణంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్ రాజకీయ తన జీవితాంతం పేదలు, కార్మికుల కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఈ క్రమంలో ఎన్నో త్యాగాలు చేశారని, దుర్భర దారిద్ర్యాన్నీ అనుభవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ హుస్సేన్, డి.సుభాష్ చంద్రబోస్, సుభాని, ఫాతిమా, మస్తాన్‌రావు పాల్గొన్నారు.



నరసరావుపేటలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



నష్టం వివరాలు తెలుసుకుంటున్న పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్

నష్టాన్ని నివేదించి పరిహారానికి కృషి

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని చల్లగుండ్ల - దేచవరం గ్రామాల మధ్య అకాల వర్షాలకు పడిపోయిన వరి పంటలను పల్నాడు జిల్లా ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. వారి ఎదుట రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. చల్లగుండ్లకు చెందిన రైతు కంభంపాటి ఏసురత్నం మాట్లాడుతూ తాను ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు పైరంతా నీటిలో పడి కంకులు మొలకలు వచ్చాయని ఆవేదనకు గురయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1047 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, చల్లగుండ్లలో 312 ఎకరాలు, దేచవరంలో 335 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని తెలిపారు. సూర్యకుమారి మాట్లాడుతూ నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించి నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పారు. పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, తహశీల్దార్ సురేష్, ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి దేవదాసు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు రూ.2.88 కోట్ల కళ్యాణమస్తు, షాదీ తోఫా



ప్రజాశక్తి - నరసరావుపేట : వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో వివాహం చేసుకున్న ముస్లిములకు ఆర్థిక ప్రోత్సాహం జమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో 269 జంటలకు రూ.2.88 కోట్ల లబ్ది చేకూరినట్లు చెప్పారు. మైనార్టీలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీల్లో కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేలు, వికలాంగులకు రూ.1.50 లక్షలు, రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.40 చొప్పున అందుతుందని కలెక్టర్ వివరించారు. ఈ మేరకు లబ్ధిదార్లకు మెగా చెక్కులను అందించారు.

కోలాహలంగా ఆటో కార్మికుల మేడే ప్రదర్శన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎర్రజెండాల ఆవిష్కరణ - 2 వేల మందికి అన్నదానం



ప్రదర్శలో ఆటోలు, ట్రాలీలు, ముందుభాగంలో కార్మికుల సందడి





జెండా విష్కరణలో ఆర్‌టిఒ, నాయకులు, కార్మికులు. అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌టిఒ, ఎస్ఐ

ట్రాఫిక్ గోలలో.. వాహనాల రొదలో నిత్యం బతుకు బండిని హడావుడిగా నిడిపే ఆటో, ట్రాలీ డ్రైవర్లు శుక్రవారం తమ వాహనాలన్నింటినీ బారులుదీరించారు. డప్పుల మోతతో చిందులేసుకుంటూ ర్యాలీ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో, ట్రాలీ డ్రైవర్లు పట్టణంలో శుక్రవారం భారీ ప్రదర్శన చేశారు. పండుగ వాతావరణంలో ఎర్రజెండాల ఆవిష్కరణతోపాటు 2 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత ఉదయం 11 గంటలకు స్థానిక కళామందిర్ సెంటర్ వద్ద ప్రారంభమైన ప్రదర్శన చౌత్రా సెంటర్, ఎన్ఆర్‌టి సెంటర్, అడ్డ రోడ్డు సెంటర్ మీదుగా తిరిగి కళామందిర్ సెంటర్‌కు ప్రదర్శన చేరింది. అనంతరం స్థానిక ఆటో స్టాండ్‌లో మేడే జెండాను సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి ఆవిష్కరించారు. శివాలయం వద్ద రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో బోర్డును, జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై చిటికిమాటికి కేసులు పెట్టొద్దని, వారికి వడ్డీలేని రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాలని కోరారు. డ్రైవర్లకు వ్యక్తిగత ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చేయించాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. వీటి సాధనకు ఆటో డ్రైవర్లంతా ఐక్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ముఖ్యఅతిథులుగా హాజరైన రవాణాశాఖాధికారి టి.వి.నాగలక్ష్మి, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ లోకేశ్వరరావు మాట్లాడుతూ బస్సులు వెళ్లలేని చోటుకు ఆటోలు వెళ్లి ప్రయాణికుల అవసరాలను తీరుస్తున్నాయని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను కేటాయించిన స్టాండ్‌లలోనే పెట్టుకోవాలని కోరారు. డ్రైవర్లంతా ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం ఆందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, అది డ్రైవర్లు, వారి కుటుంబాలకే కాకుండా ప్రయాణికులకూ శ్రేయస్కరమని చెప్పారు. వాహన పత్రాలను కలిగి ఉండాలని, పరిమితికి మించి బరువుతో ప్రయాణం, అతివేగం చేటని అన్నారు. సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేడే నేపథ్యం, ప్రాధాన్యాన్ని వివరించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని, అందులో భాగంగానే 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. కార్మికుల్ని బానిసలుగా మార్చే వీటికి వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. డ్రైవర్లకు ప్రమాదభరితంగా ఉన్న 2019 ట్రాన్స్‌పోర్ట్ చట్టాన్ని, రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిఒ, ఎస్ఐను ఆటో డ్రైవర్లు సన్మానించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బి.శంకరరావు, కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, రాజు, వెంకటేశ్వర్లు, నవీన్, కుమార్ పాల్గొన్నారు.

మార్క్సిజం శాస్త్రీయ సిద్ధాంతం

కార్ల్‌మార్క్స్ జయంతి సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో ఎప్పటికైనా కార్మిక రాజ్యం వస్తుందని, సమాజ మార్పు గురించి తెలిపిన శాస్త్రీయ సిద్ధాంతం మార్క్సిజం అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శుక్రవారం కారల్ మార్క్స్ 205 జయంతి సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో మార్క్స్ చిత్ర పటానికి సిపియం సీనియర్ నాయకులు ఎమ్.డి అక్బర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మానవ శ్రమ నుండే పెట్టుబడి ఉద్భవిస్తుందని, శ్రమకు తగ్గ ప్రతిఫలం కోసం కార్మికులు ఉద్యమిస్తారని, చివరకు కార్మికులు రాజ్యాధికారాన్ని చేపడతారని కారల్ మార్క్స్ మొదటి సారిగా సూత్రీకరించారని, ఆ సిద్ధాంతం ప్రపంచంలో అమలులోకి వస్తుందని, మార్క్సిజం శాస్త్రీయ సిద్ధాంతమని పేర్కొన్నారు. సోషలిస్టు సమాజంలో మాత్రమే కష్టజీవులకు న్యాయం జరుగుతుందని, సమ సమాజం కోసం కష్టజీవులంతా ఉద్యమించాలని పిలుపు


మంగళగిరిలో నివాళి


గుంటూరులో మార్క్స్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న పాశం రామారావు

నిచ్చారు. నేడు మనం చూస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాల గురించి కారల్ మార్క్స్ ఆనాడే చెప్పారన్నారు. మార్క్సిజం వెలుగులో కుల, మత, ప్రాంతీయ తత్వాలకు వ్యతిరేకంగా, దేశరక్షణ కోసం, ఐక్యత కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు జి.వెంకట్రావు, ఆది నికల్సన్, మస్తాన్‌వలి, బి.లక్ష్మణరావు, శంకర్, మూర్తి, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి : మార్క్సిజం అజేయమని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చేంగయ్యా అన్నారు. కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో కార్ల మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, పట్టణ నాయకులు ఎస్ గణేష్, టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పొన్నూరు ఐలాండ్‌సెంటర్‌లో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మార్క్స్ జయంతి సభ ఆటో యూనియన్ నాయకులు మిక్కిలి బాబు అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఎఐటియు పొన్నూరు నియోజక వర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు, పట్టణ కార్యదర్శి జంపని గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేశన శంకరరావు

బిసి కులగణనపై స్టే విధింపు బాధాకరం

ప్రజాశక్తి-గుంటూరు

బీహార్‌లో కులగణంకాలపై పాట్నా హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమని, ఇప్పటికైనా కేంద్రం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శుక్రవారం స్థానిక చుట్టుగుంటలోని సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ 2021లో నిర్వహించాల్సిన బిసి కులగణన కోవిడ్ కారణంగా కేంద్రం వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. ఆయ రాష్ట్రాలకి గణాంకాలు సేకరించే అధికారాన్ని కేంద్రం ఇచ్చిందన్నారు. జనాభా లెక్కల్లో భాగంగా కులగణన చేపట్టాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రతిపక్ష నాయకులతో కలిసి ప్రధాన మంత్రిని కలిశారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా కేంద్రాన్ని పార్టీలకు అతీతంగా, అడుగుతున్నా ఎందుకు వెనుకంజ వేస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. దేశంలో మొట్టమొదట సారిగా బీహార్ ముఖ్యమంత్రి తొలిసారిగా బీసీ కుల గణన చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. అయితే అక్కడ రాష్ట్ర ప్రభుత్వంపై కొంతమంది పిటిషన్ దాఖలు చేయడం వలన కులగణంకాలు చేయవద్దని న్యాయమూర్తులు స్టే ఇవ్వడం శోచనీయం అని పేర్కొన్నారు. కేంద్రం స్పందించి స్టే ఎత్తివేత్తకు, కులగణన సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఓబిసి గణాంకాలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, గణాంకాలు కేంద్ర ప్రభుత్వం సేకరించకపోవడం వలన అన్ని రంగాలలోనూ ఓబీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు ద్వారక శ్రీనివాసరావు గారు, బీసీ యూత్ నాయకులు పోటు రాజు పాల్గొన్నారు.


గాంధీ పార్కును సందర్శించిన మేయర్, ఎమ్మెల్యే

ఆధునిక హంగులతో గాంధీపార్కు

ప్రజాశక్తి-గుంటూరు

గాంధీ పార్క్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, త్వరలో ప్రారంభించనున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో గాంధీ పార్కులో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే ముస్తఫాతో కలిసి మేయర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గాంధీ పార్క్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నామన్నారు. నగర ప్రజలు పిల్లలు, పెద్దలు వారి కుటుంబాలతో సహా ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడుపటానికి వీలుగా గ్రీనరీని అభివృద్ధి చేసి పార్కును సిద్ధం చేస్తున్నామన్నారు. పార్కులో ప్రజల ఆహ్లాదం కొరకు చిల్డ్రన్స్‌ప్లే ఎక్విప్‌మెంట్, పెద్దలకు ఓపెన్ జిమ్, స్కేటింగ్ పరికరాలు, ఫౌంటెన్లు, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వము గాంధీ పార్కును అభివృద్ధి చేయాలని తలంచలేదని, నగర పాలక సంస్థలో నూతన పాలక వర్గం ఏర్పడ్డాక గాంధీ పార్కు అభివృద్ధితో పాటు నగరంలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యస్.ఈ భాస్కర్‌రావు, ఈ.ఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఎ.డి.హెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎగసి పడుతున్న మంట నుండి మందార పువ్వు

పిల్లల కేరింతల మధ్య ప్రారంభమైన 'మ్యాజిక్ నేర్చుకుందాం రండి' సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-తాడేపల్లి

బాలల్లో ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్లో మ్యాజిక్ నేర్చుకుందాం రండి సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇంద్రజాలకుడు క్రాంతికార్, అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు, ఎంటిఎంసి బాలోత్సవం ఉపాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, కోశాధికారి గాదె సుబ్బారెడ్డి జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉదయం ఎనిమిది గంటలకే మ్యాజిక్ నేర్చుకోవడానికి బాలలు అరవిందకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి మ్యాజిక్ ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ మాట్లాడుతూ మనకు ఎంతో ఇచ్చిన సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. మ్యాజిక్ నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఓ రేంజ్‌కు చేరుకోగలరని



చిన్నారులకు సూచించారు. ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు, ఎంటిఎంసి బాలోత్సవం ఉపాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ మ్యాజిక్ నేర్చుకోవడం ద్వారా సమాజంలో ఉన్న అంతరాలు, అవాంతరాలు ఎలా ఉంటాయో, ఎలా గట్టెక్కి ముందుకు సాగవచ్చో తెలుసుకుంటారని చెప్పారు. పది రోజుల పాటు జరిగే ఈ మ్యాజిక్ శిక్షణా శిబిరం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే సమ్మర్ క్యాంప్ మ్యాజిక్ శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా వివిధ రకాల మ్యాజిక్‌లను క్రాంతికార్ చేసి చూపించారు. మండుతున్న మంట నుంచి మందార పువ్వు రావడంతో పిల్లల కేరింతలతో హాలు మార్మోగింది. సమంగా లేని మూడు తాళ్లను సమం చేసే టెక్నిక్‌ను ఆయన చేసి చూపించారు. తెల్లకాగితాల నుంచి డబ్బు నోట్ల కాగితాలను తీసి అబ్బురపరిచారు. రెండు గ్లాసుల మధ్యలో వంద రూపాయల నోటు పెట్టి గ్లాసు కదలకుండా నోటు తీసే మ్యాజిక్‌ను చేసి చూపించడంతో పిల్లలు చప్పట్లు కొట్టారు. శనివారం నుంచి ఉదయం తొమ్మిది గంటల నుంచి మ్యాజిక్ శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. తమ పేర్లు నమోదు చేయించుకున్న వారు సమయానికి రావాలని, నమోదు చేయించుకోని వారు నమోదు చేసుకోవాలని కోరారు. నేటి నుంచి జరిగే శిక్షణలో మ్యాజిక్ నేర్పడంతో పాటు మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అరవింద హైస్కూల్ యాజమాన్యం ఈ సందర్భంగా పిల్లలకు రాగి జావ పంపిణీ చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

వరుస వర్షాలతో అన్నదాత కుదేలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తొలకరిలో కురవాల్సిన వర్షాలు మండుటెండలు కాసే మే నెలలో కురుస్తున్నాయి. దీంతో అన్నదాత పంట నష్టపోయి కుదేలయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం 11 నుంచి ఒంటి గంట వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పసుపు, మొక్కజొన్న, ఆకుకూరలు వేసిన రైతులు తమ పంటలను నష్టపోయారు. శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లిలో నష్టపోయిన పంట పొలాలను రైతు సంఘం నాయకులు సందర్శించారు. హార్టికల్చరల్ అధికారులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు హార్టికల్చరల్ అధికారులతో మాట్లాడారు. తడిసిన పసుపును ప్రభుత్వం వెంటనే క్వింటా రూ.10వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది పసుపు వేసిన రైతులకు విత్తనాల దగ్గర నుంచి మందుల వరకు ధరలు పెరిగిపోయాయని తెలిపారు. మొక్కజొన్న, జొన్న, ఆకుకూరల పంటలు వేసిన రైతుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని రైతు సంఘం నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌బికెల ద్వారా తడిసిన పంటలను వెంటనే కొనుగోలు చేయాలని, ఆకుకూరలు పండించే రైతులకు కూడా ఎన్యుమరేషన్ పూర్తి చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హార్టికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాలాజీనాయక్, హెచ్ఒ దీపిక, ఎఇఒ వెంకయ్య, పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, రైతులు తియ్యగూర సోమశేఖరరెడ్డి, మందాపు సురేష్‌రెడ్డి, బుర్రముక్కు శివరామిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మోదుగుల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొలనుకొండకు చెందిన రైతులు బొల్లా శ్రీనివాసరావు, సాంబయ్య, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రధాన కాల్వల్లో పూడికతీత ప్రారంభించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ మేరకు ప్రధాన కాల్వల్లో పూడిక తీత పనులకు టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలో మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్, అభివృద్ధి పనుల వేగవంతంపై జిఎంసి అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ మేరకు పూడికతీత పనులు పక్కగా చేపట్టాలని ఆదేశించారు. అలాగే నగరంలో చేపట్టిన పార్కుల అభివృద్ధి పనులు నిర్దేశిత గడవు ప్రకారం పూర్తి చేయాలన్నారు. పార్కుల్లో సివిల్ వర్కులు పూర్తి అయిన వెంటనే గ్రీనరీ అభివృద్ధికి ఏడిహెచ్ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఐలాండ్స్ పనులు కొన్ని చోట్ల నత్త నడకన జరుగుతున్నాయని, తదుపరి సమీక్షా సమావేశం నాటికి పూర్తి అయ్యేలా చూడాలని ఈఈలను ఆదేశించారు. నాడు-నేడు పనుల్లో వేగం పెంచాలన్నారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏడిహెచ్ రామారావు పాల్గొన్నారు.

రైతుకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పాలకవర్గ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి పాలకవర్గ సమావేశం శుక్రవారం జరిగింది . వ్యవసాయ మార్కెట్ కమిటీ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో గౌరవ అధ్యక్షులు మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివద్ధికి విశేషంగా కషి చేస్తుందన్నారు. అలానే వ్యవసాయ కమిటీలు కూడా రైతాంగానికి అందుబాటులో ఉండి వారి , ఆదాయాన్ని పెంచే విధంగా కషి చేయాలని సూచించారు. పాలక వర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో పశువుల సంతను ఏర్పాటు చేయాలని అలాగే అంచ్చెంపేట రోడ్డు లో మార్కెట్ యార్డు చెక్ పోస్టు ఏర్పాటుకు తీర్మానం చేశారు. యార్డు లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకానికి అనుమతి ఇవ్వాలని మంత్రి అంబటి రాంబాబు ను చైర్మన్ పెండెం బాబురావు విజ్ఞప్తి చేశారు.రైతుల సౌకర్యార్థం యార్డు ప్రాంగణంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని.


వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సూచించారు.ముందుగా దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి , డైరెక్టర్లు, యార్డ్ కార్యవర్గ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



గుడి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ నందు బ్రహ్మంగారి గుడి నిర్మాణం కొరకు శంకుస్థాపన శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమము మున్సిపల్ చైర్మన్ షేక్. రఫా ని కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

నవధాన్యాలు సాగు చేద్దాం

ప్రజాశక్తి - క్రోసూరు

నవధాన్యాల పంటలను సాగు చేయటం వలన భూమాతకు జీవం పోసినట్లే అని రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకతి వ్యవసాయ రైతులు సిబ్బందితో నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కే అమలుకుమారి మాట్లాడుతూ ఏప్రిల్ జూన్ నెలలో వచ్చే తొలకరి వర్షాలకు నేలను దుక్కి దున్ని ఎకరాకు 13 కేజీల నవధాన్యాలు పంటలు రైతులు సన్నద్ధం చేయాలని సూచించారు.



బాబు పర్యటన అడ్డుకోవాలనుకోవడం పిరికి చర్య: టిడిపి

ప్రజాశక్తి-బెల్లంకొండ

అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి కొనే నాథుడు లేక, ఓదార్చేవాడు లేక, అల్లాడుతున్న రైతన్నలను కలిసి వారి సమస్యలు తెలుసుకునేందుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు పర్యటనను పోలీసుల ద్వారా అడ్డుకోవాలని చూడడం సిగ్గుచేటు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు గుంటూరు తన కార్యాలయంలో బెల్లంకొండ మండలానికి చెందిన టిడిపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి మాట్లాడుతూ మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూ అకాల వర్షాలతో రైతు అల్లాడుతుంటే కనీసం పరామర్శ కూడా చేయని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు రైతు సమస్యలను తెలుసుకునేందుకు వెళుతుంటే అడ్డుకోవాలని చూడడమేమిటని అన్నారు.

జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేద కుటుంబాలకు అండగా ఎప్పు డు జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఉంటుందని చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. దాని లో భాగంగా పేద కుటుంబం ఉన్న దానిలోనే ఘనంగా వివాహం చేసు కునేందుకు 10 వేల రూపాయల ఆర్థి క సహాయం చేశారు. పట్టణములోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షేక్ సైదులు (లేటు), అమీ నాబి దం పతుల కు మా ర్తె నాగురబీ వివాహానికి శుక్రవా రం నాడు జాన్ సైదా 10 వేలు ఆర్థిక సహాయం చేశారు. అందుకు గాను ఆ కుటింబికులు వీరికి ధన్యవాదాలు తె లిపారు. ఈ కార్య క్రమంలో ఎం. వి. రత్నారెడ్డి తదితరు లు పాల్గొన్నారు.

సమ్మర్ అలవెన్స్, పే స్లిప్‌లు ఇవ్వాలి

ప్రజాశక్తి - యడ్లపాడు


జగ్గాపురంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టం చేయడంతోపాటు గతంలో ఇచ్చిన సమ్మర్ అలవెన్స్‌ను కొనసాగించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన యడ్లపాడుతోపాటు కారుచోల, జగ్గాపురం, జాలాది గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశాలను వారు శుక్రవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లేని రోజుల్లో కూలీలకు ఆదరువుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తోందని, ఇందులో భాగంగా బడ్జెట్‌లో నిధులను భారీగా తగ్గించిందని చెప్పారు. దీనికితోడు అనేక నిబంధనలు తెస్తోందని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టంను రద్దు చేయాలని కోరారు. ఈ సమస్యలపై కలెక్టరేట్ వద్ద 22న నిర్వహించే ధర్నాలో కూలీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వి.రెడ్డిపాలెం చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్ కు అవార్డులు

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ కు అన్ని విభాగాల్లో 12 అవార్డులు వచ్చాయని బ్యాంక్ మేనేజర్ టి.కిషోర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 175 కోట్ల వ్యాపారం జరిగిందని అన్నారు. 200 కోట్ల దిశగా వ్యాపారం జరుగుతుందని అన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో 100 నుండి 125కోట్లు,125 నుండి 150 కోట్లు, 150 నుండి 175 కోట్లు వ్యాపారం జరిగిందని అన్నారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తూ రైతులకు, కస్టమర్లకు వెన్నుదన్నుగా నిలవటం జరిగిందని అన్నారు. బ్యాంక్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నూరు శాతం మొండిబకాయిలు వసూలు చేయటం జరిగిందని అన్నారు. ఈ విధంగా తమ బ్యాంక్ అన్ని విధాలా కస్టమర్లకు, రైతులకు సత్వరసేవలు అందించడంలో మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ కు అన్ని విభాగాల్లో 12 అవార్డులు వచ్చిన సందర్భంగా బ్యాంక్ సిబ్బంది మేనేజర్ టి.కిషోర్ రెడ్డి ని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు మండల విద్యా శాఖ అధికారులకు

ఇంక్రిమెంట్ల కోత పెట్టడంపై యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి-నరసరావుపేట

సంస్థాగతమైన,విద్యార్థులు చేసే చిన్న చిన్న పొరబాట్లకు ఉపాద్యాయులపై మండల విద్యా శాఖ అధికారులపై విద్యా శాఖ ఉన్నతాధికారులు వేధింపులు ఆపకపోతే యూటీఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఏకం చేసి పోరాటం చేయడానికి వెనుకాడేది లేదని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, జి.విజయ సారధి లు శు క్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమ దుస్తులు ధరించలేదని బూట్లు వేసుకోలేదని చిన్న చిన్న కారణాలతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొంత మంది ఉపా ధ్యాయులు మండల విద్యా శాఖ అధికారుల ఇంక్రిమెంట్లలో కోతలు విధించడాన్ని యుటి ఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పాఠశాల సందర్శన సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సమ దుస్తువులు ధరించలేదని షఉస్ వేసుకోలేదని చిన్న చిన్న కారణాలతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల ఇంక్రి మెంట్లలో కోతలు విధించడం తగదన్నారు. పాఠశాలల తనిఖీ సందర్భంగా విద్యార్థులు నోటు పుస్తకాలను సరిగ్గా కరెక్షన్ చేయలేదంటూ ఉపాధ్యాయులపై పర్యవేక్షణ సరిగ్గా లేదంటూ పలువురు మండల విద్యాశాఖ అధికారులకు కూడా నోటీసులు ఇవ్వడం తగదన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ పల్నాడు జిల్లా పాఠశాల సందర్శన సందర్భంగా అనేక పాఠశాలలు సంతప్తికరంగా ఉన్నాయని ఒకవైపు చెబుతూనే ఇప్పుడు ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులకు ఇంక్రిమెంట్లు కోతలు విధించడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల ఇంక్రి మెంట్లలో కోతల విధించాలంటే నిబంధన ప్రకారం ఏదైనా బలమైన నేరాలు చేసి ఉండాలని అటువంటి సందర్భంలోనే ఇంక్రి మెంట్లో కోతలు విధించాలని ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు గ్రహించాలని హితవు పలికారు.

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు ఇటువంటి భయాందోళన కలిగించడం తగదన్నారు. ఉపాధ్యాయులపై మండల విద్యాశాఖ అధికారులపై వేధింపులు గురి చేయడంపై ఉన్న శ్రద్ధ జగనన్న విద్యా కానుక కిట్లు,నోటు పుస్తకాలు అందజేయడంలో చూపించాలని సంస్థాగతమైన తప్పులకు ఉపాధ్యాయులు వేధించడం సరికాదని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటువంటి వేధిం పులు మానుకోకపోతే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇంక్రిమెంట్లలో విధించిన కోతలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



తడిచిన పంటను ప్రభుత్వమే కొనాలి : జీవీ

ప్రజాశక్తి-ఈపూరు

తడిసిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదు కోవాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో తడిసిన మొక్కజొన్నను శుక్రవా రం ఆయన పరిశీలించారు.రైతు ధూళిపాళ్ల రామకృష్ణ ఆరబోసిన మొక్కజొన్నను పరిశీలించి పంట నష్టం పై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో చేతి కందిన పంట నీటి పాలవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నా సీఎం జగన్ ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికి ఎకరాకు రూ.75వేలు, మొక్కజొన్న ఎకరాకు రూ. 35వేలు పరిహారం చెల్లించాలన్నారు.

మిరపకు రూ.50వేలు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

అకాల వర్షాలకు నష్టపోయిన మిరప ఎకరానికి 50వేల రూపా యలు ఇవ్వాలని పెదకూరపాడు మండల రైతు సంఘం నాయకులు తహశీల్దార్ క్షమారాణికి వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం ఇచ్చిన వినతి పత్రంలో మొక్కజొన్నకు ఎకరానికి రూ.20,000 నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.మిరపకాయలను ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా క్వింటా 20000 మొక్కజొన్న 2500 రూపాయలు చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో పల్నాడు జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి డిఎస్ రావు, దర్శి సురేష్, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 6 మే 2023



301 మందికి కళ్యాణమస్తు, షాదీతోఫా

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, భవన, ఇతర నిర్మాణ రంగాలకు చెందిన వధూవరులకు వైఎస్ఆర్ కళ్యాణ మస్తు- వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా ఆర్ధిక సహాయం అందించడం ఒక బహత్తర కార్యమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి సిఎం జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కళ్యాణ మస్తు- వైఎస్.ఆర్ షాదీతోఫా నిధులు జమ చేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, కిలారి వెంకట రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని 301 లబ్దిదారులకు రూ.2 కోట్ల 60 లక్షల 60వేలు వారికి ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

కలెక్టర్‌కు టిడిపి నాయకులు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు టిడిపి గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాని, చిట్టిబాబు తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, పొన్నూరు నియోజక వర్గంలో తెల్లజొన్న, మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని, ప్రత్తిపాడు



నియోజక వర్గంలో, ఇతర అన్ని మండలాల్లో మిర్చి మొక్కజొన్న, పొగాకు, శనగ పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. తెనాలి నియోజకవర్గంలో ధాన్యానికి, మొక్క జొన్నకు నష్టం జరిగిందని చెప్పారు. మంగళగిరిలో అరటి, పసుపు పంట, మొక్కజొన్న, జొన్నకు నష్టం వచ్చిందని, తాడికొండలో మిర్చి రైతులు నష్ట పోయారన్నారు. రైతులు పెట్టే పెట్టుబడులకు, ఆదాయానికి పొంతన లేదని, ఈస్థితిలో అకాల వర్షాలు రైతులకు మరింత నష్టానికి మిగిల్చాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి, నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరారు.

'రైతులపై రాజకీయాలొద్దు.. ఆదుకోండి'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులపై రాజకీయాలు మాని రైతును ఆదుకోండి అని ప్రత్తిపాడు నియోజవర్గ కోఆర్డినేటర్ మాకినేని పెద్దరత్తయ అన్నరు. శుక్రవారం ప్రత్తిపాడు మండల పరిధి లోని వంగిపురం మేడవారిపాలెం గ్రామాల రైతులను కలిశారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా పెదరత్తయ్య మాట్లాడుతూ మొక్కజొన్న రైతు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టామని, అకాల వర్షాలకు పంట మొత్తం చేను లోనే కింద పడిపోయిందని, కండెలు నీటిలో మునిగిపోయి, గింజలు రంగు మారడం, బూజు పట్టాయని, ఆరబోసిన గింజలను పట్టాలు కప్పినప్పటికీ నీళ్ల చేరి గింజలు బూజు పట్టాయని రైతులు చెప్పారని అన్నారు. ప్రభుత్వం ధాన్యం మాత్రమే కాకుండా తడిసిపోయిన మిరప, పొగాకు,మొక్కజొన్నను కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రికి ఎంత సేపటికి రాజకీయలపైనే దృష్టి పెడుతున్నారు



తప్ప ప్రజలపై, రైతులపై ధ్యాసే లేదని విమర్శించారు. రైతులను ఆదుకోవాలని, ఉన్న పంటనైనా దళా రులు పాలు కాకుండా చూడాలని కోరారు. గుంటూరు జిల్లా రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వంగిపురంలో దాదాపు వెయ్యి ఎకరాల ఎకరాల మొక్కజొన్నకు బూజు పట్టి, రంగు మారిందని అన్నారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.2,700 ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మండలంలోని వ్యవసాయ శాఖాధికారి, పార్టీల పరంగా నష్టం అంచనా వేస్తున్నారని ఆరోపించారు.

నేడు జిల్లా బేస్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక

ప్రజాశక్తి- మేడికొండూరు:మండలంలోని మందపాడు వజ్రాల అప్పిరెడ్డి ఉన్నత పాఠశాలలో శనివారం గుంటూరు జిల్లా బేస్ బాల్ బాల బాలికల జట్లు ఎంపికలు జరుగుతాయని జిల్లా బేస్బాల్ అసోసియేషన్ సెక్రటరీ కడియం జయ రావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు 13, 14, 15 అనంతపురంలో జరుగు రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. గుంటూరు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ కడియం జయరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959164809 సంప్రదించాలని తెలిపారు.

చేనేత కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి టిట్కో హౌస్ లో నివాసముంటున్న చేనేత కార్మికుడు అందే సాంబశివరావు కు షుగర్ ఎక్కువ కావడంతో అతనికి ఒక కాలును తొలగించడం జరిగింది. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడటంతో మంగళగిరి పట్టణ పద్మశాలి సంఘం రూ.5,000,గంజి రవీంద్రనాథ్, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి రూ.10,000 సహాయం శుక్రవారం అందజేశారు.



మద్దూరి వీరయ్యకు నివాళి

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజాశక్తి మాజీ ఏజెంట్ మద్దూరి వీరయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా సిపిఎం పెదనందిపాడు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాగులపాడులోని వారి స్వగృహం వద్ద వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనం గా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ప్రజాశక్తి గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేసేందుకు ప్రతిరోజు 8 కిలోమీటర్లకు పైగా సైకిల్‌పై వెళ్లి వచ్చేవారని, వ్యవసాయ కార్మిక సంఘ అభివృద్ధికి ఆయన కృషి చేశారని అన్నారు. వీరయ్య కు నివాళులర్పించిన వారిలో ఆయన భార్య మద్దూరి చిట్టమ్మ , కుమారులు శ్రీనివాసరావు, రమణ, కోడళ్ళు విజయకుమారి, సరిత ,కుమార్తెలు అల్లడి కనకమ్మ, సుబ్బాయమ్మ, కుటుంబసభ్యులు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు రైతు సంఘ నాయకులు కాపు వెంకట సుబ్బారావు, చుక్క యానా దులు, ప్రజాశక్తి విలేకరి వి.ఎన్ శివయ్య పాల్గొన్నారు.

మున్నంగిలో డ్రైడే..ఫ్రైడే

ప్రజాశక్తి-కొల్లిపర : పరిసరాలను పరిశుభ్రతతో దోమలను నివారించవచ్చని వైద్యాధికారిని చిక్కాల లక్ష్మీసుధా అన్నారు. డ్రై డే ఫ్రైడేలో భాగంగా మున్నంగిలో శుక్రవారం పర్యటించారు. నీటి నిల్వలను గుర్తించి ఎబేట్ ద్రావణాన్ని చల్లించారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, కోటేశ్వరి, నాగమల్లేశ్వరరావు, కుసుమ, శివలీల, సుజాత, వనజ పాల్గొన్నారు.

'ఎన్ఆర్ఐ' విద్యార్థినికి బంగారు పతకాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేరళలో జరుగుతున్న ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. తెనాలి ఎన్ ఆర్ ఐ కాలేజ్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న షేక్ సబీనా భారతదేశం తరపున 4 బంగారు పతకాలు సాధించింది. కేరళ రాష్ట్రంలో శుక్రవారం జరిగిన 84 కేజీ ల సబ్ జూనియర్ విభాగంలో షేక్ షబీన బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్లు కోచ్ ఎస్ కె సందాని తెలిపారు. స్క్వాట్ -172.5 కేజీ, బెంచ్ ప్రెస్-75 కేజీ, డెడ్ లిఫ్ట్-160 కేజీ ఓవరాల్ 407.5 కేజీ ల బరువును ఎత్తి భారత దేశానికి 4 బం



గారు పతకాలు సాధించిందని కోచ్ తెలిపారు. మంగళగిరి ఫిట్నెస్ జిమ్ లో షబీనా తన దేహదారుఢ్యాన్ని పెంపొందించినట్లు తెలిపారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అధ్యక్షులు గుమ్మడి మల్లేశ్వరరావు, ఎపి పవర్ లిఫ్టింగ్ అధ్యక్షులు ప్రభాకర్, సకల సూర్యనారాయణ, కార్యదర్శి సకల కోటేశ్వరరావు షబీనాను అభినందించారు.

ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన అధికారి

ప్రజాశక్తి-తెనాలి

జోనల్ మలేరియా అధికారి బి వినోద్ కుమార్ తెనాలి జిల్లా ఆసుపత్రిని శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో పలు విభాగాలను అధికారులతో పరి శీలించారు. ముఖ్యంగా ఎస్ ఎస్ హెచ్ ల్యాబ్, పెథాలజీ, మైక్రో బయాలజీ, మలేరియా ల్యాబు ను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం తెనాలి పట్టణంలోని మారీసుపేట సందర్శించి, అక్కడ



ఫ్రైడే డ్రైడే లో పాల్గొని దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులపై అవగాహన కల్పిం చారు. దోమల సంతతి వ్యాధుల వ్యాప్తికి కారణమవు తున్నాయన్నారు. అనంతరం మారిసు పేట వైద్యా ధికారి డాక్టర్ మేరీ తో వైద్య సేవలను చర్చించారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మంగళగిరి

మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని నూతనంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మర్రి రాజ శేఖర్, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరం జీవి, మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఆర్టీసీ మాజీ ఉద్యోగి మృతి - సిపిఎం నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి

ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగ పని చేసి పదవి విరమణ పొందిన దామర్ల నాగేశ్వరరావు 75 సంవత్సరాలు శుక్రవారం మంగళగిరి పట్టణంలోని మూడో వార్డులో మతి చెందారు. భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరావు ఎస్డబ్ల్యుఎఫ్ యూనియన్ లో పనిచేశారు. సిపిఎం సభ్యుడిగాను కొన్నాళ్లు పనిచేశారు. ప్రస్తుతం సానుభూతి పరులుగా ఉన్నారు. నాగేశ్వరావు భౌతికయంపై సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం పట్టణ నాయకులు ఎస్ వెంకటేష్, ఎం బాలాజీ, ఎస్ గణేష్, టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు సాధారణ సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మార్కెట్ యార్డు సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి యార్డు చైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఆదాయ వ్యయాలపై సమీక్షించారు. అదేవిధంగా యార్డు పరిధిలో రైతులకు సంబంధించిన పలు సమస్యలను డైరెక్టర్లు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో యార్డ్ వైస్ చైర్మన్ నాగలక్ష్మి, యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.



పౌరాణిక కళాకారుడు బసవయ్యకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో శుక్రువారం ఎన్టీఆర్ నటించిన తీర్పు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా పౌరాణిక కళాకారుడు కుర్రా బసవయ్యను పార్టీ లీగల్ సెల్ నాయకులు ఎం.మల్లికార్జునరావు, ఎ.కిషోర్, బి.సురేంద్ర, జి.శ్రీనివాస్ తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

యాదవ సాధికార కన్వీనర్ల సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర యాదవ సాధికార కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశం రాష్ట్ర యాదవ సాధికార కన్వీనర్ వై. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పొలిట్ బ్యూరో సభ్యులు రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ఆధునీకరించిన గ్రాండ్ నాగార్జున ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక బ్రాడీపేటో ఆధునీకరించిన గ్రాండ్ నాగార్జున హోటల్‌ను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. కోణార్క్ హోటల్స్ గ్రూపు ఆధ్వర్యంలో ఈ హోటల్‌ను నిర్వహించనున్నారు.



హోటల్ పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేయర్ కావాటి మనోహర్ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, పారిశ్రామిక వేత్త తులసి ధర్మచరణ్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్ పాల్గొన్నారు. ఆలపాటి మాట్లాడుతూ గ్రాండ్ నాగార్జున హోటల్ గుంటూరు పట్టణానికి ఒక తలమానికగా ఉందన్నారు. నూతనంగా కోణార్క్ హోటల్స్ యాజమాన్య ఆధ్వర్యంలో పునర్ ప్రారంభించడం చాలా సంతోషదాయకమని అన్నారు. కోణార్కు గ్రూపు చైర్మన్ ఎలవర్తి నాగరాజు మాట్లాడుతూ హోటల్ వ్యాపార రంగంలో తమ సంస్థ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ తనదైన ముద్ర వేసుకుందన్నారు. తమ హోటల్‌లో ఫ్యామిలీ రెస్టారెంట్, ఫంక్షన్ హాల్స్, కాన్ఫరెన్స్ మీటింగ్ హాల్స్, సూట్‌రూమ్స్, ఆత్యాధునిక ఇంటీరియర్ డిజైన్‌తో ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపొందించినట్లు తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కాలేజి డైరెక్టర్ తదితరులు

కళ్లం కాలేజీలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

ప్రజాశక్తి - గుంటూరు

కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో 2023లో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థుల ప్లేస్‌మెంట్ సక్సెస్‌మీట్ (అచీవర్స్ డే)-2023ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 540కుపైగా కార్పొరేట్ కంపెనీల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. కాలేజీ చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీటెక్, ఎంబిఎ, డిప్లొమా ఆఖరి సంవత్సరం చదువుతున్న, ఉద్యోగాలు పొందిన 400 మందికి పైగా సక్సెట్ మీట్‌కు హాజరయ్యారని హర్షం వ్యక్తం చేశారు. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్, కోర్ కంపెనీలు టిసిఎస్, ఎస్‌ఎల్‌కె సాఫ్ట్‌వేర్, ఎఎస్‌ఐ, ఎస్‌పి సాఫ్ట్‌వేర్, ఎఫ్ట్రానిక్స్, అప్లాయిడ్, మెఘా ఇంజినీరింగ్, రాంకీ ఇంజినీరింగ్, టోల్‌ప్లస్ తదితర 35కుపైగా కార్పొరేట్ కంపెనీల్లో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఏడాదికి రూ.3 లక్షల నుండి రూ.12 లక్షలకుపైగా వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పిఎల్ మాధవరావు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని, తల్లి తండ్రులను అభినందిస్తున్న యాజమాన్యం

మలినేనిలో ప్లేస్‌మెంట్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం ప్లేస్‌మెంట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2022-23 విద్యాసంవత్సరం చదువుతున్న వివిధ విభాగాలకు సంబంధించిన విద్యార్థుల్లో 400 మంది టిసిఎస్, క్యాప్‌జెనిని, అసెంచ్యూర్, కాగ్నిజంట్, వొడాఫోన్, ఎల్ అండ్ టి, యాక్సిస్ బ్యాంక్, హెక్సావేర్, టెక్ మహేంద్ర, సాంటీస్ వంటి కంపెనీల్లో ఉద్యోగం సాధించిన విద్యార్థుల తలిదండ్రులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసీ సీడ్స్ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు హాజరై మాట్లాడుతూ ఈ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, ఈ రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారని అన్నారు. యువత ఉద్యోగం ఆలోచన నుంచి మరికొంత మందికి ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అన్నారు. పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వి.అనిత మాట్లాడుతూ 400 మందికిపైగా గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఉద్యోగాలు రావటం ఆనందదాయకం అన్నారు. పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ గ్రాంట్స్ ఉపయోగించుకొని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ఐటి రంగంలో ఈ సంవత్సరం ఎంతో మాంద్యం ఉన్నప్పటికీ గత మూడు సంవత్సరాలుగా క్రమశిక్షణతో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య తరగతుల వల్ల నేడు వందలాది మంది వివిధ అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని అన్నారు. కారక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్వేత, డైరెక్టర్ డి.శ్రీనివాస్‌కుమార్, పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డీన్‌లు డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, జంపని కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజాశక్తి-నరసరావుపేట : నరసరావుపేట మండలంలోని యలమంద విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం అమలయ్యే గ్రామాల్లో ముందు రోజే ఏ.ఎన్.ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ సమావేశం పెట్టుకొని వాలంటీర్లు గ్రామంలో ప్రజలకు వైద్య సేవలు అందించే సమాచారం తప్పని సరిగా తెలియజేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో ఏ.ఎన్.ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, సిబ్బంది పనితీరు పై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం దిశగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. వైద్య పరీక్షల అనంతరం ఆ వివరాలను ఎం.ఓ హెల్త్ యాప్, ఎం.ఎల్.హెచ్.పీ యాప్ లో నమోదు చెయ్యాల్సి ఉండటంతో జిల్లా కలెక్టర్ విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బంది వద్ద ఉన్న యాప్‌లను పరిశీలించారు. అయితే గ్రామస్తులకు సరైన సమాచారం లేక రోగులు రాక పోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను జిల్లా కలెక్టర్ మందలించారు. ఎన్.సి.డి. సి.డి సర్వే ఎంత వరకు చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. నెలలో రెండు సార్లు డాక్టర్‌లు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం అమలు అయ్యే విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖ అందిస్తున్న అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకునేలా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. డాక్టర్లు తొలిసారి విజిట్ చేసే సమయంలోనే ఒపిలో వైద్య పరీక్షలు నిర్వహణను పూర్తి చెయ్యాలని సూచించారు. మీ పరిధిలో ఎంత మంది డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ గుర్తించారని ఏ.ఎన్.ఎం ను అడిగి తెలుసుకుని వారిలో ఎంత మందికి వైద్య పరీక్షలు చేయించారని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వారందరికీ మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్. జి. శోభారాణి, మండల స్పెషల్ ఆఫీసర్ నాగ శ్రీనివాస్, డాక్టర్ మమత, నరసరావుపేట తహాశీల్దార్ ఆర్.వి రమణ నాయక్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

రేపటి నుండి ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 7వ తేదీ నుండి ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె.సాయికుమార్ తెలియజేశారు. శుక్రవారం ఫౌండేషన్ క్లాసులకు సంబంధించిన పోస్టర్‌ను సన్ ప్రతినిధులతో కలిసి లక్ష్మణరావు ఆవిష్కంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజులపాటు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకూ నిర్వహించే శిక్షణలో నిపుణులు, ఉన్నతాధికారులు తరగతులు తీసుకుంటారని తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు కూడా హాజరు కావచ్చని తెలిపారు. ఇతర వివరాలకు, పేర్లు నమోదుకు 9121514792, 7207566702, 9493906174 నంబర్లలో సంప్రదించాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, సన్ ప్రతినిధులు

జిజిహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ సర్జరీ రెండో యూనిట్ వైద్యులు అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాలు ఉన్నాయి. కృష్ణా జిల్లా ఈర్లపాడు మండలం నరసింహరావు పాలెం గ్రామానికి చెందిన లక్ష్మయ్య కామెర్ల వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. కడుపులో గడ్డ ఉందని దీని వల్ల లివర్ కు ఇన్ఫెక్షన్ వచ్చి కామెర్లు వస్తున్నాయని దీనికోసం ఆపరేషన్ చేయాల్సి వస్తుందని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు రోగి బంధువు లకువివరించారు. అయినా ప్రాణానికి గ్యారంటీ లేదని ఇందుకోసం రూ.పది లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడం తో కుటుంబ సభ్యులకు దిక్కు తోచలేదు. చివరి ప్రయత్నంగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని రోగి కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి 19 వ తేదీన జిజిహెచ్ జనరల్ సర్జరీ వార్డుకు రోగిని తీసుకుని వచ్చారు. ప్యాంక్రియాస్ గ్రంధిలో క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించిన వైద్యులు సిటీ స్కాన్, యం ఆర్ ఐ తదితర పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేశారు. ప్యాంక్రియాస్ క్యాన్సర్ ఉండటం వల్ల కామెర్లు వచ్చాయని తెల్చారు. జనరల్ సర్జరీ వైద్యులు రోగికి పరీక్షలు చేసి గత నెల 23న దాదాపు ఆరు గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్స చేసిన విధానం గురించి శుక్రవారం జనరల్ సర్జరీ వార్డులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతితో కలసి జనరల్ సర్జరీ రెండో యూనిట్ హెచ్ ఓ డి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. ఆపరేషన్ పూర్తి చేసినప్పటికి అశ్రద్ధ చేయకుండా 24 గంటలు పర్యవేక్షణ పరిశీలన చేశామన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో కామెర్లు పూర్తిగా తగ్గిపోవడంతో రోగి కోలుకుని చక్కగా నడుచుకుంటూ తన పని చేసుకుంటున్నాడని ఆయన వివరించారు. సర్జరీలో డాక్టర్ రమణాచలం, డాక్టర్స్ సంతోష్ కుమార్, వంశిధర్, అనుషా, నిఖిల్, కిషోర్, లిఖిత, కోటేశ్వరరావు, వేణుగోపాల్, మత్తు వైద్యులు మహేష్ బాబు, చంద్రశేఖర్, ఆనంద్ బాబు, స్వర్ణలత, ధరణి, లావణ్య, కవిత పాల్గొన్నారు.

ఎంతో క్లిష్టమైన ఆపరేషన్ చేసిన డాక్టర్స్ వై కిరణ్ కుమార్ వారి వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అభినంది ంచారు. ఆరోగ్య శ్రీకింద రూ.10లక్షలతో ఆపరేషన్ ప్రభుత్వ వైద్యశాలలోనే సాధ్యమయ్యిందన్నారు.



చికిత్స చేసిన రోగితో వైద్య బృందం, సూపరింటెండెంట్

విగ్రహాల ఏర్పాటు కోసం వినతి

సజ్జలను కలిసిన ఎమ్మెల్సీలు, నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని హిందూకళాశాల కూడలిలో ఐలాండ్ ఏర్పాటు చేసి జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని బిసి సంఘాల నాయకులు ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, జంగా కృష్ణమూర్తితో కలసి విగ్రహాల సాధన కమిటీ కన్వీనర్ వై.కోటేశ్వరరావు,కో కన్వీనర్‌లు ఉగ్గం సాంబశివరావు, జూపూడి శ్రీనివాసరావు, దొంతా సురేష్,గంటా ప్రభుధాస్, ఎ.నాగమల్లేశ్వరరావు, సాదం సత్యనారాయణ, పొట్లూరి శివదాస్‌కైలా జయసుధ, రాచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు నగరపాలకసంస్థ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని వారు సజ్జలను కోరారు.

